# అదే - కూతురంటే

కోలపల్లి ఈశ్వర్

అందరూ అతనివంకే చూస్తున్నారు. వారి చూపుల్లో అతనిపట్ల పట్టరాని కోపం వుంది. ఏవగింపు వుంది. ఏదో ద్వేషం వుంది.

"మృదుల పెళ్లి చేయడం అనేది తండ్రిగా మీ బాధ్యత. అందుకే ఈ పెళ్లి ఎలా చేస్తారో మీరే ఆలోచించుకోండి."

ఈ మాటలు అన్నది సత్యనారాయణ పెద్దకోడలు. ఆమె భర్త రమణ వ్యవసాయ శాఖలో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడు. సొంతంగా ఇల్లు కట్టాడు.



"వదిన చెప్పింది కరెక్టే నాన్నా.. నువ్వు కూతురు పెళ్ళి చేయలేనంత దౌర్భాగ్య స్థితిలో లేవు. మంచి సంబంధం ఇది. కట్నం కూడా తక్కువే అడుగుతు న్నారాయె. లక్ష... లక్షన్న రతో ఆడపిల్ల పెళ్ళి చేయడం జరిగేపనా ఈ రోజుల్లో?! అనవసరంగా కాలయాపన చేస్తే అది పెళ్ళీడుకొచ్చిన పిల్ల.. ఎవడినో ప్రేమించానని వాడితో లేచిపోతే ఆనక మన కుటుంబ పరువు ప్రతిష్ఠలు ఏమైపోతాయో చెప్పండి. మృదుల నా మాటలు వింటున్న సంగతి నాకు తెలుసు. అది ఇక్కడే వుంది. అయినా నేనీమాట అనక తప్పడం లేదు. నేను బిజినెస్ చేస్తున్నమాట నిజమే. కానీ నా సంపాదనకు మించిన సమస్యలు నాకున్నాయి. సుమారు ఐదు లక్షలు బ్యాంకులోన్లు వున్నాయి. వాటి వడ్డీలు కట్టడానికే తల ప్రాణం తోకకొస్తున్నది. నేనేం చేయలేను. మీ కర్తవ్యం మీరు నిర్వహించండి." అన్నాడు సత్యనారా యణ రెండో కొడుకు వరప్రసాద్.

"నాన్నా.. ఆ రోజు నీ అదృష్టం బావుండి ఆనాడు ఆయన నన్ను అంతంత మాత్రం కట్నం తీసుకుని పెళ్ళిచేసుకున్నాడు. నాకెంత అన్యాయం జరిగిందో నా మనసుకే తెలుసు. అయినా నేనుగానీ, అయనగానీ నిన్ను పల్లెత్తుమాటైనా అన్నామా?! ఎప్పటికైనా నువ్వు ఆస్తిలో ఎంతోకొంత నాకు ఇవ్వకపోవులే అనే నమ్మకంతో ఉన్నానిన్నాళ్ళూ. మృదుల పెళ్ళి చేయాలంటే ఈ ఇల్లు అమ్మడం ఒక్కటే నీకున్న మార్గం. ఎంత పాత ఇల్లయినా ఘనంగానే వుంది కాబట్టి.. ఎంత లేదన్నా ఐదారు లక్షల దాకా వస్తాయి. దాని పెళ్ళి ఖర్చులు పోగామిగిలిన డబ్బుతో నా మీద ప్రేమకొద్దీ ఎంతిస్తావో ఇచ్చి, మిగతాది నీకు ప్రేమున్న వాళ్ళకిచ్చుకో. నిన్ను కంటికి రెప్పలా నేను చూసుకుంటాను. నువ్వూ, అమ్మ కలిసి మా ఇంట్లోనే వుందురుగానీ.." అంది సత్యనారాయణ పెద్దకూతురు కామాక్షి.

ఎవరెన్ని మాటలు చెప్పినా సత్యనారాయణ ముఖ కవళికల్లో మార్పేమీ రావడం లేదు. అతను వాలు కుర్చీలో నిశ్చలంగా కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

"పిల్లలు చాలాసేపటి నుండీ మాట్లాడుతున్నారు. వాళ్ళకి ఏదో ఒక సమాధానం చెప్పండి మరి.." అంది లక్ష్మమ్మ ఆయన ధర్మపత్ని.

సత్యనారాయణ కళ్ళు తెరిచి అందరివంక ఒక్కసారి చూశాడు. కుర్చీలోంచి లేచి అటూ ఇటూ పచార్లు చేశాడు.

గోడకు తగిలించి వున్న తన తండ్రి, తాతల ఫోటోల దగ్గరకు వెళ్ళి ఆ ఫోటోలవైపు చూశాడు. చేతులు వెనక్కి కట్టుకుని గొంతు సవరించుకున్నాడు.

"చాలా సంతోషం. మీరు నిండు మనసుతో నాపై ప్రేమకొద్దీ ఇచ్చిన సలహాలకి నాకెంతో



ఆనందంగా వుంది. మీకందరికీ నా కృతజ్ఞతలు.

బిడ్డలెప్పుడూ తల్లిదండ్రుల నుండి ఆశించేవారే తప్ప కన్నవాళ్ళకి తిరిగి ఇచ్చేవాళ్ళు కారని మీరు ఋజువు చేశారు.

ఎన్నెన్ని కష్టాలకోర్చి మీకు చదువులు చెప్పించి, మిమ్మల్నింతవాళ్ళని చేశాను. మీకు ఏ లోటూ రాకుండా చూసుకుని మీ పెళ్ళిళ్ళు జరిపించాను. మీరంతా ఈ రోజు స్వతంత్రులు. మీకు మీ స్వంత కుటుంబాలూ, సంపాదనా ఉన్నాయి. అయినా చిన్నదాని పెళ్ళి చేయడానికి తలా కొంత సాయం చేద్దామన్న ఆలోచన మీలో ఏమాత్రం లేదు. పైగా నానుండి ఇంకా ఏదో వస్తుందని ఆశపడుతున్నారు.

చెట్టు ఎంత ఇచ్చినా ఇంకా దాని ఫలాలకోసమే చూడ్డం అంటే ఇదే. ఇప్పుడు చెట్టుపై ఏం మిగల్లేదు. ఇంకా దాన్ని నరికి కర్ర అమ్మేసి సొమ్ము చేసుకుందామన్న ఆలోచన మీది.

పాలిచ్చినంత కాలం ఆవును ప్రేమగా చూసి, అది వట్టిపోయిన రోజు దాన్ని చంపి దాని చర్మం అమ్మేసి లాభపడదామనుకుంటున్నారు.

మీరు నిజంగా కరడుకట్టిన స్వార్థపరులు. మీలో కృతజ్ఞత, కరుణ, సానుభూతి, మానవత్వం అనేవి మచ్చుకైనా లేవు.

నేను నా జీవితంలో ఇంతవరకూ నా పూర్వీకుల ఆస్తిపాస్తులపై ఏనాడు ఆధారపడ లేదు. నా రెక్కలు ముక్కలు చేసుకునే ఈ సంసారాన్ని ఇంతవరకూ నెట్టుకొచ్చాను. నాకేగనక అలాంటి పనికిమాలిన ఆలోచనలుంటే ఏనాడో ఈ ఇల్లు అమ్మేసి జల్సాలు చేసేవాడ్ని.

మనిషి ఎప్పుడూ తన స్వశక్తిపై తాను ముందుకు పోవాలి. పూర్వీకులు మిగిల్చిపోయిన సొమ్మేదైనా అది చివరిదాకా వుండాలి. ఒక తరం నుండి మరో తరానికి అది వారసత్వంగా రావాలి. అంతేతప్ప వాళ్ళు సంపాదించింది మన కోసమే కదా అని ఉన్నదంతా తగలేయడం తెలివిగల పని కాదు.

ఇప్పుడు మృదుల పెళ్ళి చేయడం కోసం నేను ఈ ఇల్లు నమ్మేస్తానని మీరు అనుకుంటే అది పొరపాటు. ఇది తరతరాలుగా వస్తున్న ఆస్తి ఇది నేడు ఈ విడని కోల్పోయి బాధలు పడ్డం నావల్లకాదు. నేను స్వార్థపరుడివనీ, కూతురి పెళ్ళికోసం ఇల్లు అమ్మనంటున్న మూర్ఖుడిననీ మీరు నన్ను తిట్టుకోవచ్చు. అది మీ సంస్కారం.

మరి దాని పెళ్ళి ఎలా జరుగుతుంది? అని మీరంటారా? అందుకు నాదొకటే ప్రశ్న. ఈ ఇల్లే లేకపోతే దాని పెళ్ళి ఎలా జరిగి వుండేది?

అంతే! నా దృష్టిలో ఈ ఇల్లు లేదు. ఉన్నా ఇది అమ్మడానికి కాదు. నా చివరి శ్వాసవరకూ నేనిందులో ఉంటాను. ఆ తరువాత ఎలా జరిగేది అలా జరుగుతుంది. నా ఈ నిర్ణయంలో మార్పులేదు"

ఈ మాటలు అక్కడున్న వాళ్ళందరికీ అంతులేని ఆగ్రహాన్ని కలిగించాయి.

ఆవేశం పట్టలేక మనిషోమాట అనసాగారు. అక్కడ చిన్నపాటి యుద్ధ వాతావరణమే నెలకొంది.

అంతలో ఎవరూ ఊహించని విధంగా మృదుల వారి ముందుకు వచ్చింది.

"ఆగండి.. మీరెవరూ నా గురించి గొడవలు పడనవసరం లేదు. నాన్న చెప్పిందే కరెక్టు. ఆయన సిద్ధాంతానికి నేను సపోర్టుగా వుంటాను. నాకు పెళ్ళి జరగకుండా పోదు. అన్నయ్య చెప్పినట్టుగా నేను ఎవరినైనా ప్రేమించినా ప్రేమించొచ్చు. కానీ లేచిపోవాల్సిన అగత్యం ఏమీలేదు. నిర్భయంగా ఆ అబ్బాయిని నాన్నకు పరిచయం చేసి, ఆయన ఆశీస్సులతోనే పెళ్ళి చేసుకుంటాను.

అయినా సమస్య అంతదూరం రాదని నా నమ్మకం. నాకు చదువుంది, తెలివుంది. కష్టపడి మంచి ఉద్యోగం సంపాదిస్తాను. పైసా కట్నం ఆశించని మంచి వ్యక్తినే పెళ్ళి చేసుకుంటాను.

నా ఆశయం సిద్ధించడంలో కొంత ఆలస్యం కావచ్చు. అయినా నష్టం లేదు. అంతవరకూ అమ్మ నాన్నలతో వుంటాను. నాన్న ఆశయాన్ని సఫలం చేస్తాను. ఇంక మీరు నా గురించేమీ దిగులు పడవద్దు" అంటూ చేతులు జోడించి అందరికీ నమస్కరించి వెనుదిరిగింది మృదుల.

సత్యానారాయణ మృదులను చేయి పట్టి దగ్గరికి తీసుకుని ఆమె తలపై ప్రేమగా చేయి వేసి "అదీ కూతురంటే..." అన్నాడు గర్వంగా.

❋